# 'ఎస్ఎల్బీసీ'పై జ్యుడీషియల్ కమిషన్ వేయండి

- బాధితుల సహాయ చర్యల్లో అధికారులు వేగం పెంచాలి
- బాధ్యులపై చర్యలు తీసుకోండి
- రేవంత్‌రెడ్డి చేతగానితనం వల్లే రైతుల ఆత్మహత్యలు
- బాధిత రైతు కుటుంబాలను ప్రత్యేక ప్యాకేజీతో ఆదుకోవాలి
- వ్యవసాయ అత్యవసర పరిస్థితి ప్రకటించాలి: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఓవైపు సహాయ చర్యలను మరింత వేగవంతంగా కొనసాగిస్తూనే, జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టి, , బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం తెలంగాణభవన్‌లో జాతీయ మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రాజెక్టుల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. తాజా సొరంగ ప్రమాదం వల్ల ప్రభుత్వానికి రూ.వందల కోట్ల ఆర్థిక నష్టం జరిగిందని విమర్శించారు. ఇంతకుముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేయలేదని, బాధ్యులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. ఈ ప్రమాదాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ నేతలు, ముఖ్యమంత్రి సహా, అనేక అంశాలపై న్యాయ కమిషన్ల ఏర్పాటు కోసం డిమాండ్ చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేక న్యాయ కమిషన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. 'తాజా ప్రమాదాలపై న్యాయ విచారణ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నం. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఆర్మీ, ఇతర సంస్థల సహాయంతో ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే వెనక్కి తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం మరింత కృషి చేయాలి' అని కేటీఆర్ కోరారు.

### వ్యవసాయ ఎమర్జెన్సీని ప్రకటించాలి

రాష్ట్రంలో వ్యవసాయ అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎండుతున్న పంటలను కాపాడుకోలేక రైతులు దిక్కుతోచనిస్థితిలోకి వెళ్లి చివరికి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగంలో మోగుతున్న మరణమృదంగానికి రేవంత్‌రెడ్డి చేతగాని పాలనే ప్రధాన కారణమని దుయ్యబట్టారు. రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. ప్రభుత్వం ధైర్యం చెప్పాల్సింది పోయి కరువుగా చిత్రీకరించే కుట్రలు చేస్తున్నందువల్లే రైతులు దిగులు చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి తన అసమర్థతను ఒప్పుకొని ఇప్పటిదాకా జరిగిన రైతుల ఆత్మహత్యలకు పూర్తి బాధ్యత వహించాలని, బాధిత రైతు కుటుంబాలకు స్పెషల్ ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదేండ్లు పండుగలా సాగిన వ్యవసాయాన్ని 14 నెలల్లోనే పాతాళానికి నెట్టి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్న ముఖ్యమంత్రి తన వైఫల్యంపై క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యలపై రాహుల్ గాంధీ స్పందించాలన్నారు. రాజకీయ ప్రతీకారాల కోసం రైతులను బలిచేస్తూ ముఖ్యమంత్రి క్షమించరాని పాపం చేస్తున్నారని నిప్పులు చెరిగారు.



## ఘటనా స్థలానికి ర్యాట్ మైనర్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందం

### అతిసమీపంలోకి వెళ్లి చిత్రీకరణ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ సొరంగంలో జరిగిన ప్రమాద ఘటన స్థలానికి మంగళవారం రాత్రి ర్యాట్ మైనర్స్, ఎన్డీఆర్ఎఫ్, ఎల్అండ్‌టీ బృందాలు చేరుకొని అక్కడి దృశ్యాలను చిత్రీకరించాయి. సొరంగం లోపల జరిగిన ల్యాండ్ స్లైడ్ దృశ్యాలు ఇందులో ఉన్నాయి. ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఈ బృందాలు అతి సమీపంలోకి వెళ్లాయి. అయితే అక్కడ చుట్టూ ఉన్న లైనింగ్ ఏ క్షణంలోనైనా కూలడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆ దృశ్యాల్లో కనిపిస్తున్నాయి. పేరుకుపోయిన బురద.. ఉబికి వస్తున్న నీరు ఇవన్నీ చూస్తుంటే ప్రమాద ఘటన ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థమవుతున్నది. రెస్క్యూ బృందాలు చివరకు నిస్సహాయ స్థితిలో తిరిగివచ్చాయి. ర్యాట్ మైనర్స్, ఎన్డీఆర్ఎఫ్, మేఘాకు చెందిన నిపుణులు కూడా లోపలికి వెళ్లి టన్నెల్‌లో బురద ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టలేమని.. టన్నెల్‌లోని పరిస్థితిని వీడియో చేసి పోస్టుచేశారు. ఇందులో బురద ఎంత మేర చేరిందో టన్నెల్ పైకప్పు వారికి అందుతుండటాన్ని అంచనా వేయొచ్చు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




# సొరంగం.. భయానకం..

- చివరి అరకిలో మీటరు వరకు వెళ్లలేం
- 150 మీటర్ల మేర కూలిన సొరంగం
- 3 కిలోమీటర్ల వరకే సెల్‌ఫోన్ సిగ్నల్స్
- సొరంగంలో పనిచేయని కన్వేయర్ బెల్ట్, డ్రోన్స్, రొబోటిక్స్ కెమెరాలు
- పెరుగుతున్న నీరు, తోడివేత చాలా కష్టం



సొరంగంలో సెర్చ్‌లైట్ల వెలుగులో కనిపిస్తున్న బురద

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్బీసీ సొరంగం భయంకరంగా మారింది. అడుగు కూడా ముందుకు వేయలేని దుర్భర పరిస్థితి నెలకొన్నది. టన్నెల్‌లోని అడుగడుగునా ప్రతికూల పరిస్థితే ఎదురవుతున్నది. వెరసి లోపలికి వెళ్లిన బృందాలు నిరాశతో వెనుదిరుగుతుండగా, గంటలు గడిచేకొద్దీ చిక్కుకున్న కార్మికుల క్షేమ సమాచారంపై అందరిలోనూ ఆశలు అడుగంటుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ ఇతర బృందాలు మంగళవారం పలు అంశాలను గుర్తించాయి. లాంగిట్యూడ్, లాటిట్యూడ్ పాయింట్లతో గూగుల్ మ్యాప్‌తో ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని, తీవ్రత ఏమేరకు ఉన్నదనే అంశాలను తెలుసుకున్నారు. వారు నివేదించిన వివరాల ప్రకారం, సొరంగం లోపల అత్యంత దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. టన్నెల్ దాదాపు 150 మీటర్ల మేరకు కూలిపోయినట్టు తెలుస్తున్నది. టీబీఎం తోక భాగం దాటి కూడా శిథిలాలతో సొరంగం పూడుకుపోయింది. ఆక్సిజన్ సరఫరా చేసే వెంటిలేషన్ ట్యూబ్ పూర్తిగా వెనక్కి వంగిపోయింది. అతికష్టం మీద టీబీఎం తోకభాగాన్ని దాటుకుని 100 మీటర్ల ముందుకు చేరుకోగలిగినట్టు సహాయ బృందాలు వెల్లడించాయి. మరో 40 మీటర్ల మేర ముందుకు పోలేని పరిస్థితి ఉన్నదని, అక్కడే కార్మికులు చిక్కుకుని ఉన్నారని తెలుస్తున్నది. టన్నెల్‌లో మూడు కిలోమీటర్ల వరకే అదీ బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. టీబీఎంను దాటుకుని డ్రోన్స్ వెళ్లలేకపోతున్నాయని, రోబోటిక్ కెమెరాలు కూడా పనిచేయడం లేదని తెలిపారు. టన్నెల్ పొడవు 13.85 కి.మీ కాగా, 13.5 మీటర్ల నుంచే పూర్తిగా మట్టి, రాళ్లు, శిథిలాలతో సొరంగం నిండిపోయిందని వివరిస్తున్నారు. కన్వేయర్ 12కి.మీ వరకే లోకోట్రాక్ వినియోగానికి అందుబాటులో ఉన్నదని చెప్తున్నారు. అక్కడి నుంచి 1.11 కి.మీ వరకు లోకోట్రాక్ ఉన్నా వినియోగించలేని పరిస్థితి ఉన్నదని సహాయ బృందాలు వెల్లడిస్తున్నాయి. కన్వేయర్ బెల్ట్ కూడా పనిచేయడం లేదని వివరిస్తున్నారు.

### బురద ఓ ప్రధాన సమస్య

సొరంగంలో 2.7 కిలోమీటర్ 5.6, 7.6, 10.8, 13.5 కిలోమీటర్ల వద్ద పంపులను ఏర్పాటుచేసి డీవాటరింగ్ చేస్తున్నారు. 10.7 కిలోమీటర్ వద్ద ఊట నీరు లేదని, అయితే 10.95 కి.మీ వద్ద 1.5 అడుగుల మేరకు, 11.30 కి.మీ వద్ద 2 నుంచి 2.5 అడుగుల మేరకు నీరు ఉన్నదని, లోపలికి వెళ్లిన కొద్దీ నీటి పరిమాణం పెరుగుతున్నదని వివరిస్తున్నారు. వాలు వైపే ప్రమాదం జరగడంతో నీరు అటువైపే జాలువారుతున్నదని, దీంతో దిగువకు వెళ్లిన కొద్దీ నీటిలోతు పెరుతున్నదని చెప్తున్నారు. నీటిలో బురద ఎక్కువగా ఉండటంతో డీవాటరింగ్ ప్రక్రియ సైతం సజావుగా కొనసాగడం లేదని తెలుస్తున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన పంపులు బురదను తొలగించలేకపోతున్నాయని, మొరాయిస్తున్నాయని సహాయ బృందాలు వివరిస్తున్నాయి. బురదను పంపింగ్ చేసే పంపులు ప్రత్యేకంగా ఉన్నా కూడా వాటిని అక్కడ వినియోగించలేని దుస్థితి ఉన్నదని చెప్తున్నారు. ఇందుకు ఆ పంపులు ఎక్కువ దూరం బురదను పంపింగ్ చేయకపోవడమే కారణమని అంటున్నారు. లోకోట్రాక్ ద్వారా భారీ వాహనాలు కూడా లోపలి వెళ్లే అవకాశం లేకుండా పోయిందని చెప్తున్నారు. వెరసి సొరంగం లోపల సహాయక చర్యలకు ఏ మాత్రం పరిస్థితులు అనుకూలంగా లేవని తెలుస్తున్నది. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన ఇండియన్ నేవీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు లోపలికి వెళ్లి, నిస్సహాయంగా వెనుదిరిగి వస్తున్నాయి. సొరంగంలో లైనింగ్ లేని చోట డ్రిల్లింగ్ చేసిన ప్రదేశం కూడా ఎప్పుడు కూలుతుందోనని భయంభయంగా ముందుకు సాగుతున్నారు.






సొరంగం వద్ద మీడియాతో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# ఎస్ఎల్బీసీ క్లిష్టమైన సొరంగం

- బాధితుల కోసం పదకొండు బృందాలతో గాలిస్తున్నాం
- సర్వశక్తులూ ఒడ్డుతున్నామన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- పర్యవేక్షణనా? ఆధిపత్యమా?
- మంత్రుల విచిత్రవైఖరిపై కొనసాగిన విమర్శలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్బీసీ సొరంగంలో నీటి ప్రవాహంతో సహాయ చర్యలకు ఆటంకం ఏర్పడుతున్నదని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎల్బీసీ చాలా క్లిష్టమైన సొరంగమని, 11 బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. మంగళవారం సొరంగం వద్ద సహాయ చర్యలను పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ టన్నెల్‌లోని సహజ రాతి నిర్మాణాలు సడలడంతో అకస్మాత్తుగా నీరు, మట్టి ప్రవహించాయని తెలిపారు. టన్నెల్‌లో 12-13 అడుగుల వరకు నీరు నిండిపోయిందని చెప్పారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి అని, సమస్యను పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు, సహాయ బృందాలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వెల్లడించారు. ఎస్ఎల్బీసీపై గత పాలకులు చేసిన నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ఆరోపించారు. ఏ టన్నెల్ నిర్మాణం జరిగినా లీకేజీలు సర్వసాధారణమని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు.

### ఉత్తమ్ కోసం భట్టి నిరీక్షణ

సొరంగం వద్ద సహాయ చర్యల పరిశీలన కోసం రోడ్డు మార్గాన వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఉదయం 9:30 గంటలకు దోమలపెంటకు చేరుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు కూడా అక్కడికి వచ్చారు. వీరంతా సొరంగం దగ్గరకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ మంత్రి ఉత్తమ్ రాకపోవడంతో ఎదురుచూడాల్సి వచ్చింది. హైదరాబాద్ నుంచి దోమలపెంటకు ఉత్తమ్ హెలికాప్టర్‌లో వచ్చారు. సమీక్ష సమావేశంలోనూ ఉత్తమ్‌కుమార్ అంతా తానే అన్నట్టుగా హడావుడి చేశారని విమర్శలు వినిపించాయి. మీడియాతో కూడా ఉత్తమ్ కుమార్‌రెడ్డే మాట్లాడారు. మళ్లీ లేటెస్ట్ అప్‌డేట్ సాయంత్రం తర్వాత బ్రీఫ్ చేస్తామంటూ అక్కడి నుంచి భోజనానికి వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం మీడియా సమావేశానికి భట్టి, కోమటిరెడ్డి డుమ్మా కొట్టారు.

### అంతా పాజిటివ్‌గా చూపించండి..

ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద జరిగిన మీడియా సమావేశం తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ మీడియా ప్రతినిధిని ఉద్దేశించి మాట్లాడుతూ 'అంతా పాజిటివ్‌గా కవర్ చేయండి' అంటూ కోరారు. 'అక్కడ కూడా నెగటివ్ చూపించకండి. పాజిటివ్‌లోనే కవర్ చేయండి' అంటూ వేడుకున్నారు. ఓ వైపు హడావుడి చేస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటూనే మళ్లీ ఇలా మాట్లాడడం ఏంటని మీడియా ప్రతినిధులు ముక్కున వేలేసుకున్నారు.

### మా గోడు పట్టించుకోండి సారు !

తోటి కార్మికులు సొరంగంలో చిక్కుకుపోవడంతో నాలుగు రోజులుగా టన్నెల్ సమీపంలోని షెడ్డుల్లో విషాదచాయలు అలముకున్నాయి. బాధితుల కుటుంబ సభ్యులు క్షణ క్షణం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరోవైపు అక్కడికి వచ్చిపోతున్న మంత్రుల హడావుడి, మీడియాతో ముచ్చటించడం, సర్వశక్తులూ ఒడ్డుతున్నామని ప్రకటనలు చేయడం పరిపాటిగా మారిపోయిందని మీడియా వర్గాల్లో చర్చ నడుస్తున్నది. తమ వారి ఆచూకీ లేక తీరని దుఃఖంలో ఉన్న తమను ఓదార్చేనాథులు కరువయ్యారని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కనీసం తినడానికి తిండి కూడా లేదని, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తమ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వాపోతున్నారు.

# కాంగ్రెస్ తప్పిదం.. బీజేపీ మౌనం!

- ఎస్ఎల్బీసీ ఘటనపై నోరెత్తని కమలం నేతలు
- 'దిగ్భ్రాంతి' ప్రకటనలతో సరిపెట్టిన నేతలు
- ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడంలో విఫలం
- కేవలం ఎమ్మెల్సీ ఎన్నికలపైనే నాయకత్వం దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగి నాలుగురోజులు గడుస్తున్నా బీజేపీ మాత్రం కిక్కురుమనడం లేదు. ఘటన జరిగిన రోజు ఆ పార్టీ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రకటనలిచ్చారు. ఆ తర్వాత గప్‌చుప్ అయ్యారు. ఘటన గురించి ఒక్కరు కూడా మాట్లాడకపోవడంపై రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని ఇతర ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నా బీజేపీ నేతలు కనీసం పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సొరంగంలో పనులు ప్రారంభించే ముందు సరైన రీతిలో పరీక్షలు జరగలేదని, భద్రత ఏర్పాట్లలోను లోపాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్న సంగతి తెలిసిందే. అయినా బీజేపీ అగ్రనాయకత్వం ఎందుకు మౌనంగా ఉన్నదోనని ఆ పార్టీ శ్రేణుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలపై, హామీల అమలులో చేస్తున్న మోసాలపై ఎలాగూ పోరాటం చేయడం లేదని, కనీసం ఇలాంటి సందర్భాలలోనైనా ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపకుండా చేతులు కట్టుకోవడం ఏమిటని బీజేపీ సీనియర్ నేతల్లో చర్చ జరుగుతున్నది. జాతీయస్థాయిలో కాంగ్రెస్‌తో వైరం కొనసాగుతున్నా.. రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్న సంకేతాలు బలపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అందివచ్చిన అవకాశాన్ని అందుకోకపోవడం వెనుక?

రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారుతున్నదని, అసెంబ్లీ ఎన్నికలకు ముందున్న జోష్ ఎక్కడా కనిపించడం లేదని పార్టీ కార్యకర్తలే విమర్శిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపిన భావన ప్రజల్లోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 14 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని తప్పులు చేసినా, ప్రజలను మభ్యపెడుతున్నా, రాష్ట్రస్థాయిలో ఏ ఒక్క ఉద్యమాన్ని కూడా బీజేపీ చేపట్టకపోవడమే దీనికి ఉదాహరణగా చెప్తున్నారు. కనీసం ఇలాంటి సమయంలోనైనా స్పందిస్తే పరిస్థితిలో కాస్త మార్పు కనిపించేదని అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో ఇప్పుడు పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నేరుగా తలబడుతున్నారు. ఇలాంటి సమయంలో ఎస్ఎల్బీసీ ఘటనను బీజేపీ ఎత్తిచూపితే ఎన్నికల్లో కొంత లబ్ధి పొందే అవకాశం ఉండేదని, అందివచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకోకపోవడం వెనుక మతలబు ఏమిటని రాజకీయ పరిశీలకులు సందేహపడుతున్నారు. దీని వెనుక ఏదో బలమైన కారణం ఉన్నదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో లేకపోయినా ఇప్పటికీ బీఆర్ఎస్‌ను విమర్శించడానికి బీజేపీ నేతలు ఉత్సాహం చూపిస్తున్నారని గుర్తుచేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలను తరుచూ విమర్శించే కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వంటి నేతలు ఎస్ఎల్బీసీ ఘటనలో ఎందుకు మౌనంగా ఉన్నారన్న ప్రశ్న ఎదురవుతున్నది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రోడ్డు యాక్సిడెంట్ బాధితులను పరామర్శించలేదంటూ బీజేపీ నేతలు కొన్నేండ్ల పాటు నానాయాగీ చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కానీ ఎస్ఎల్బీసీ ప్రమాదం సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ పర్యటనలు చేస్తూ, ఎన్నికల ప్రచారం చేస్తున్నా కనీసం విమర్శించకపోవడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

